పాతనగరంలో.. బతుకమ్మ సంబురాలు

దాండియా ఆడుతున్న హోం మంత్రి మహమూద్ అలీ, యాకుత్‌పురా బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి, మలక్‌పేట బీఆర్ఎస్ ఇన్‌చార్జి అజంఅలీ

నాయిని నర్సింహారెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న హోంమంత్రి, యాకుత్‌పుర బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్‌రెడ్డి, మలక్‌పేట బీఆర్ఎస్ ఇన్‌చార్జి అజంఅలీ

సైదాబాద్, అక్టోబర్ 21 : ఐఎస్ సదన్ డివిజన్ బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి సరస్వతినగర్ కాలనీలో బతుకమ్మ సంబురాలు అంబరాన్నింటాయి. వేడుకలకు హోం మంత్రి మహమూద్ అలీ, యాకుత్‌పురా నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి సామ సుందర్ రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సరస్వతీనగర్ కాలనీ చౌరస్తాలో పరిసర కాలనీలకు చెందిన మహిళలు ఐదు అడుగుల బతుకమ్మ పేర్చారు. మలక్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్‌రెడ్డి, బీఆర్ఎస్ మలక్‌పేట ఇన్‌చార్జి అజం అలీ, శ్రీకాంత్, మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, మాజీ కార్పొరేటర్లు సామ స్వప్నా రెడ్డి, సింగిరెడ్డి స్వర్ణలతారెడ్డి, తీగల సునరితారెడ్డి, ముద్రబోయిన శ్రీనివాస్ రావు, మమత గుప్త, పద్మ, అనితా దయాకర్ రెడ్డి, ధనుంజయ, రాధాధీరజ్‌రెడ్డి, చికోటి ప్రవీణ్‌కుమార్, లింగాల హరిగౌడ్ జీహెచ్ఎంసీ పరిధిలోని పలు డివిజన్లకు చెందిన బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లు, మహిళా నాయకులు పాల్గొని స్థానిక మహిళలతో దాండియా ఆడారు. కార్యక్రమంలో సరస్వతీనగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు గున్న మహేందర్ రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ల అధ్యక్షులు మెట్టు భాస్కర్‌రెడ్డి, చింతల శ్రీనివాస్, కార్తీక్, శివ పాల్గొన్నారు.

మలక్‌పేట, అక్టోబర్ 21 : తెలంగాణ సంస్కృతికి ప్రతీకైన బతుకమ్మ వేడుకలను 8వ రోజు శనివారం మూసారాంబాగ్ డివిజన్‌లోని పలు కాలనీల్లో మహిళలు ఘనంగా జరుపుకున్నారు. ఇంద్రానగర్, దిల్‌సుఖ్‌నగర్ కాలనీల్లో మహిళలు, యువతులు సంప్రదాయబద్ధంగా బతుకమ్మలకు (గౌరీ మాతకు) పూజలు నిర్వహించారు. దిల్‌సుఖ్‌నగర్‌లో అవంతి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థినులు, మహిళా అధ్యాపకులు ఆడి పాడారు. కార్యక్రమంలో అవంతి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అప్పారావు, ఏఓ మోహన్‌రావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బతుకమ్మ ఆడుతున్న మహిళలు, యువతులు

కాంగ్రెస్ టికెట్ కేటాయింపుపై భగ్గుమన్న అసమ్మతి

చాదర్‌ఘాట్, అక్టోబర్ 21 : మలక్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కేటాయింపు అసమ్మతి నాయకులు భగ్గుమంటున్నారు. సీనియర్ నాయకులను సంప్రదించకుండా స్థానికేతరులు, కొత్త ముఖాలకు కేటాయించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పార్టీ సీనియర్ నాయకులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మలక్‌పేట నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ కేటాయింపు పై తూర్పారపడుతున్నారు. శనివారం సాయంత్రం సెట్విన్ మాజీ చైర్మన్, పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి మక్సూద్ అహ్మద్ నేతృత్వంలో కాంగ్రెస్ నాయకుడు జాఫర్ ఇక్బాల్ విలేకరులతో మాట్లాడుతూ.. దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేస్తున్న తమకు కాదని కొత్త వారికి ఇవ్వడం ఎంత వరకు సబబు అని వారు ప్రశ్నించారు. సమావేశంలో కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్‌గౌడ్, మాజీ అధ్యక్షుడు కొమిరెల్లి రాజశేఖర్‌రెడ్డి, చౌకి రవి, చిగురు బాలరాజ్ పాల్గొన్నారు.

ఇదిలా ఉండగా, ఇటీవలే పార్టీ సీనియర్ నాయకులు షేక్ అర్షద్, అశ్వాక్, కిషన్ సింగ్ నేతృత్వంలో అసంతృప్తి నాయకులు భేటీ అయ్యి టికెట్ కేటాయింపుపై ధ్వజమెత్తారు. మరోసారి సెట్విన్ మాజీ చైర్మన్ మక్సూద్ అహ్మద్ విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి బహిరంగంగా విమర్శించడం నియోజకవర్గంలో చర్చనీయాంశంగా మారింది.

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 6వ రోజు పాత మలక్‌పేట పోచమ్మ ఆలయంలోని దుర్గామాత సరస్వతీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. విగ్రహ దాత పీటీ. శంకర్ ముదిరాజ్, కుటుంబ సభ్యులు పిల్లలకు నోట్ పుస్తకాలు, పలుకలు, పెన్నులు పంపిణీ చేశారు. సాయంత్రం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

- మలక్‌పేట, అక్టోబర్ 21

క్రిస్టియన్ల సమస్యలు పరిష్కరిస్తాం

క్రిస్టియన్ల సమస్యలు పరిష్కరిస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. శనివారం మలక్‌పేట క్రిస్టియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. క్రిస్టియన్ భవన్ నిర్మాణానికి సహకారం అందిస్తానన్నారు. శ్మశాన వాటికకు స్థలం కేటాయింపు విషయంలో ప్రభుత్వపరంగా ప్రయత్నాలు చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జయకర్, సల్మాన్‌రాజ్, తిమోతి, నల్లమెల్లి మోజెస్ పాల్గొన్నారు.

- సైదాబాద్, అక్టోబర్ 21

అఖిల భారత యాదవ మహాసభ సైదాబాద్ అధ్యక్షుడిగా మధుసూదన్ యాదవ్

అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ కార్యవర్గ సమావేశాన్ని శనివారం సైదాబాద్‌లోని గ్రేటర్ కార్యాలయంలో నిర్వహించారు. గ్రేటర్ అధ్యక్షుడు మైల్‌కోల్ మహేందర్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సైదాబాద్ డివిజన్ నూతన కమిటీ అధ్యక్షుడిగా ఆరే మధుసూదన్ యాదవ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ గ్రేటర్ హైదరాబాద్ కోశాధికారి నేతుల శ్రీశైలంయాదవ్, యాకుత్‌పుర నియోజకవర్గం కన్వీనర్ బత్తుల మహేందర్ యాదవ్, సుధాకర్ యాదవ్, మన్నే మాణిక్ యాదవ్, వెంకటేశ్ యాదవ్, శేఖర్ యాదవ్ పాల్గొన్నారు. - సైదాబాద్, అక్టోబర్ 21

జయదుర్గాదేవి ఆలయంలో పూజలు

జీవన్ జ్యోతి సంఘంలో కొలువైన శ్రీజయదుర్గాదేవి ఆలయ కమిటీ చైర్మన్, హైదరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొరుడు భూమేశ్వర్ ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి పూజల్లో హోంమంత్రి మహమూద్ అలీ పాల్గొన్నారు. హోంమంత్రితోపాటు మలక్‌పేట బీఆర్ఎస్ ఇన్‌చార్జి అజంఅలీ, మలక్‌పేట బీఆర్ఎస్ అభ్యర్థి తీగల అజిత్ రెడ్డి, మూసారాంబాగ్ మాజీ కార్పొరేటర్ తీగల సునరితా రెడ్డి,మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అనితానాయక్, మాజీ డైరెక్టర్ తుమ్మలపల్లి రవీందర్‌రెడ్డి ఉన్నారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు వడ్డించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ జిల్లా ఉపాధ్యక్షులు కొత్తకాపు రవీందర్ రెడ్డి, బీఆర్ఎస్ సైదాబాద్, మూసారాంబాగ్ డివిజన్ల అధ్యక్షులు పగిళ్ల శ్రీనివాస్ రెడ్డి, రఘునందన్, మాజీ అధ్యక్షుడు కావేటి ధర్మరాజు, కృష్ణ, విక్రమ్ పాల్గొన్నారు. - సైదాబాద్, అక్టోబర్ 21

ప్రయాణికులకు ఆర్టీసీ దసరా కానుక..

– హయత్‌నగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ వి.సుచరిత

హయత్‌నగర్, అక్టోబర్ 21: బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో టీఎస్ ఆర్టీసీ, హైదరాబాద్ రీజియన్‌లో ప్రయాణికుల కోసం లక్కీడిప్ స్కీమ్‌ను ప్రవేశపెట్టినట్లు హయత్‌నగర్ డిప్యూటీ రీజినల్ మేనేజర్ వి.సుచరిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న లక్కీడిప్ స్కీమ్‌ను ఉప్పల్ చౌరస్తా, హయత్‌నగర్, మిధాని, ఇబ్రహీంపట్నం, తుక్కుగూడతో పాటు వివిధ బస్‌స్టాండ్‌లల్లో ఈనెల 18 నుంచి 30 వరకు కొనసాగిస్తున్నామని వివరించారు. బస్సుల్లో ప్రయాణం పూర్తి చేసుకున్న ప్రయాణికులు టికెట్‌కు వెనుక భాగంలో పేరు, ఫోన్ నంబర్‌ను రాసి మహిళలు, పురుషుల కోసం వేర్వేరుగా ఏర్పాటు చేసిన డ్రాప్ బాక్సుల్లో వేయాలని ప్రయాణికులను సూచించారు. ప్రతి రీజియన్ నుంచి ఐదుగురు మహిళలు, ఐదుగురు పురుషుల చొప్పున మొత్తం 110 మందికి ఒక్కొక్కరికి రూ.9,900 నగదు బహుమతులను అందించనున్నామని తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాదన్నపేట కూరగాయల మార్కెట్ ధరలు

కూరగాయలు	కిలో రూ.	కూరగాయలు	కిలో రూ.
ఆలుగడ్డ	20	సొరకాయ	10
టమాట	16	క్యాబేజ్	12
వంకాయలు	20	క్యారట్	30
బెండకాయ	20	క్యాలీఫ్లవర్	20
మిర్చి	30	దొండ	20
గోకరకాయ	20	కీర	25
చిక్కుడు	40	దోసకాయ	25
బిన్నీస్	40	క్యాప్సికమ్	34
బీరకాయ	20	బీట్‌రూట్	20
కాకరకాయ	20		

ఈ ధరలు నేటి ఉదయం 9.30గంటల వరకు కూరగాయల మార్కెట్‌లో అమలులో ఉంటాయని అధికారులు తెలిపారు